

కాశీభట్ల వేణుగోపాల్

# విడుదల శిక్ష

పడమటి సంధ్యాకాశ చిత్రాన్ని, చించుకొచ్చి నా గది కిటికీ పక్కన ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఉరి వేశా ... ఎప్పుడో గుర్తులేదు గానీ, ఆ రోజున సముద్రం హోరున ఏడ్చింది మాత్రం గుర్తుంది.

గోడకి వేలాడే ఆ సాంధ్యాకాశ చిత్రం ఒక మొదలు కథ.. ముగింపును అనంతంగా చెబుతూనే ఉంటుంది.

ఆ పడమటి సంధ్యాచిత్రం పక్కనే గోడమధ్యగా హృదయ విదారకంగా శిథిలమైన కిటికీ తూర్పుదిక్కుగా రెక్కలు చాచుకుని విలపిస్తూ ఉంటుంది. ఆ శిథిల గవాక్షం రోజూ చూసే సూర్యోదయ చిత్రం కూడా ఓ నిర్బంధ చిత్రమే...!

ఆ సూర్యుడి ముఖం ఆకాశం రసీదుమీద సర్కారీ మొహర్

ఆ గది నాదే!

ఆ గోడ నా గదిదే!

ఆ పడమటి సంధ్యాకాశ అంతరాళ చిత్రం నా గది గోడదే!

ఆ విశ్లథ గవాక్షం ... వేలాడే ఆ చిత్రానికి ఓ సాంత్వన, కారణం...

ఆ గవాక్షంలోంచే ఈ ప్రదోష చిత్రం ప్రతిరోజూ ఓ ఉషస్సును చూస్తుంది.

నా గది వెలుపలి ప్రపంచం నాకు తెలుసు. అదో అతి విశాలమైన బందిఖానా! గొలుసులతో కట్టబడి జనాలు గానుగెద్దుల్లా తిరుగుతూంటారు. అక్కడి పక్షి పాట కూడా సెంట్రీబ్యూగల్ లాగా వినిపిస్తుంది. నేనూ ఆ బందిఖానాలోనే బందీనే! ప్రపంచపు బందిఖానా నుంచి విడుదలై, నా ఈ విశాల స్వాంత ఏకాంత విశ్వంలోకి వచ్చి నాలుగురోజులైనా కాలేదు ... నాకు తెల్సు, నన్ను మళ్లీ ఖైదు చేస్తారు ... నిజం మరి!

జీవిస్తూ పట్టుబడిపోతాను.

నాకు తెల్సు నేను నేరస్తుడిని... కంపల్సివ్ క్రిమినల్ని, జీవించడం నేరమని నాగరకతా శాస్త్రాలు చెబుతూనే ఉన్నా తలకెక్కనివాడిని, ఏం చేయను మరి?

జీవితం ఓ వ్యసనమైపోయింది.

వ్యసనానికి బానిసనైన నేను ... ఆ నేరానికి దాసోహమనే అంటూంటాను... జీవితపు గురుత్వాకర్షణకి లోనై మాటిమాటికీ దానిలోకి లాగబడుతూంటాను. జీవితపు మత్తునుంచీ కోలుకున్న వాళ్లకి 'విడుదల' జారీ చేస్తారు నాగరకులు ... ఆ విడుదల ... అనుభవిస్తూ నా విశాల ప్రపంచపు నాలుగ్గోడల మధ్యకి వచ్చేశాను. జీవిత వ్యసనపరులకూ, దాని మత్తునుంచీ కోలుకోలేని వాళ్లకీ ఈ విడుదల ఓ శిక్ష!

నా విశాల ప్రపంచంలోంచి ... నా శిథిల గవాక్షం గుండా బయటి బందిఖానాలోకి తొంగి చూస్తున్నా...

ఎంతమంది ఖైదీలు?

ఒక ఖైదీ జీవిత లాలసకు బానిసైనవాడు... తన సుఖాలకి చేదు గుర్తులుగా ఉన్న పుట్టుబానిసలైన పసి ఖైదీలను ఈడ్చుకు వెళ్తున్నాడు... వాడు మొహమ్మీద ఆకాశమంత నవ్వును అతికించుకున్నాడు. ఆ పసిఖైదీలు బానిస జీవిత జ్ఞానప్రాసనకై భుజాలమీద మిథ్యా మేథోక్రతువు సామాన్లని మోస్తున్నారు. వాళ్ల కళ్లల్లోంచి నీటి పువ్వులు రాలుతున్నాయి. చిత్రంగా

వాళ్లు వేసే అడుగులు అతి పురాతనమైన లోహపు మూసల్లో పడుతున్నాయి. పెద్దా, చిన్నా తారతమ్యం లేకుండా పసిపాదాలక్కూడా ఆ ముద్రలు అమరిపోతున్నాయి.

"ఒరేయ్! నీకు రాని, లేని జ్ఞానం ... ఆ పసి వెధవల్కి రాదురా!"

నా విశాల ప్రపంచంలోంచి అరిచి వాడిని పిలిచా! వాడు నన్ను అసహ్యంగా చూసి పక్కనే మోటార్‌సైకిల్‌పైనున్న ఓ సఫారీ వేసుకున్న ఖైదీతో అంటున్నాడు

"వీడి కిదో రోగం ... అప్పుడప్పుడూ ఇలా తన్నుకుని అరుస్తూంటాడు. ఈ వెధవకి ఆ విడుదల శాశ్వతం చేసేస్తే మనం బాగుపడతాం!" అని కాండ్రించి నావైపు ఉమ్మి, ఆ కసికాయల్ని లాక్కువెళ్లిపోయాడు.

మొన్నటికి మొన్న బయటి బందిఖానా చీకటిగొంది నుంచీ ఓ సబ్ ఇన్‌స్పెక్టరనబడే రక్షక భక్షక ఖైదీ ఇలాగే అరిచాడు. కానీ వాడి భాష వేరు... వాడో విశిష్ట ఖైదీ!

బయటి ఆ చీకటిగొందిలో తప్పా తాలూ ఏరుకు తినే పిచుకల గుంపులాంటి గుంపొకటుంది. ఆ చీకటి గొందిలో, ఇంకా ఇంకా చీకటిగా ఉండే బొరియల్లో, భయం భయంగా... గుబులు గుబులుగా... ఆకలితో, రోగాల్తో ... బ్రతుకుమీద మమకారంతో ఉంటుందా గుంపు...

దాన్ని ముద్దుగా 'రండీఖానా' అంటారు. బందిఖానాలోని ఆ రండీఖానాకు వచ్చా డీ సబిన్స్పెక్టరు. అక్కడ ఓ పాలపాప ... రెక్కలు వచ్చీ రాని చిన్ని పిట్ట కువకువమంటూ ఎగుర్తోంది. ముద్దుపేరుతో దాని బుగ్గలు సాగదీశాడు వీడు. దాని కళ్లనిండా నీళ్లొచ్చాయి. పువ్వుల్ని గిల్లితే ఆకులు ఏడ్చినట్టు ఉండిందా దృశ్యం... దాని బుగ్గ పిండిన చేతిని చూసుకున్నాడు ఆ సబిన్‌స్పెక్టరు. చేతిలోకి కారిన దాని బాల్యాన్ని ఓ పది సంవత్సరాలు ముందుకు పరుగెత్తి చూశాడు వాడు అంతే...

తన భవిష్యచ్చిత్రానికి తానే బలైపోయిందా పాలపాప!

శిథిలమైన కిటికీగుండా విడుదలైన నేను చూస్తుండగానే ... 'సృష్టికార్యం' అనే ఓ విధ్వంసక చర్యకు పాలబడ్డాడు ఆ సబిన్స్పెక్టరు.

"ఒరేయ్! నీకు లేని, తెలియని న్యాయన్నీ, నీతినీ జనాలకేం పంచుతావురా?" అని నే నరుస్తూంటే...

"ఈ లంజాకొడుక్కి జీవితాన్ని తాగడం తెలీదు ... నాకు నేర్పుతాడా... వీడికి విడుదల శాశ్వతం చేసేయండి తొత్తుకొడుకు!" అని 'అ'న్యాయ శాస్త్రాన్ని నెత్తిన పెట్టుకుని వెళ్లిపోయాడు.



"ఏమండీ...ఇవాళ మా మహిళామండలిలో అబద్ధాలపోటీ జరిగిందండీ."

"సెకండ్ ఎవరొచ్చారే?!"

- కలపర్తి సత్యం, ఏలూరు

అందరూ నన్నూ, నాలాంటివాళ్లనీ అసహ్యంగా చూస్తారు. ఎందుకో నాకు తెల్సు... కాస్సేపైనా జీవితాన్నుంచి తప్పించుకురాగలం మేము. అదీ...!

ఇంతలో ఏదో నినాదాల హోరు వినిపించింది బయట బందిఖానాలోంచి.

"స్త్రీని, స్త్రీత్వం నుంచి వేరుచేయాలి!"

"స్త్రీ జిందాబాద్!"

"స్త్రీత్వం ముర్దాబాద్!"

"వేలాడే అందాలు మాకొద్దు... వాటిని నిషేధిస్తున్నాం!"

"ముట్టులూ కట్టుబాట్లూ నరకం నరకం...! ప్రకృతి క్రమం మారాలి!"

"నానేసిన న్యాప్కిన్లాంటి బ్రతుకులు అసహ్యం! కాల్చేయండి... కాల్చేయండి!"

ఇంకా అలాగే చాలా చాలా ... అందులో ఎక్కువభాగం అర్థం కాలేదు.

వాళ్లిద్దరూ హల్లీసకం ఆడుతూ అరుస్తున్నారు. ఎవ్వరూ ముందు లేరు, ఎవ్వరూ వెనుక లేరు... అంతా ఒకరి వెన కొకరే గుండ్రంగా, అందరూ ముందే... అందరూ వెనుకే!

నా కిటికీ పక్కగా వాళ్లు కదుల్తూంటే అందులోని ఓ ఖైదీని పిలిచా.

ఆ ఖైదీ ఓ పొడుగాటి వస్త్రాన్ని ఒంటికి చుట్టుకుని, కళ్లద్దాలు పెట్టుకుని, ప్రపంచం నుంచీ దాక్కునే ఓ ముఖాన్ని చేత్తో పట్టుకునుంది.

"నీ పేరేంటీ బందీ?" అడిగా.

"సుద్దుల మల్లమ్మ!" అందా బందీ.

"ఎందుకు అరుస్తున్నారు?"

"అబ్బే ... ఉత్తినే! ఇదో ఆట, అంతే! జైల్లో ఉన్నాంగా, విసుగేస్తోంది. కాస్సేపు సరదాగా కాలక్షేపం. అంతే!" అంది సుద్దుల మల్లమ్మ.

"ఓహో... నిజమేమో ననుకుని హడలి చచ్చా, మల్లమ్మగారూ!" భయం నటిస్తూ అన్నా.

"నీ వెటకాలం చాల్లే, పురుగా! మాకు తెలీదా ఆ మాత్రం! ప్రకృతిసిద్ధమైన వాటికి ఎవరేం చేస్తారు? అయినా, నీ కిదేం రోగంరా మగవందీ! మా ఆటల్లో దూరడానికి సిగ్గులేదూ ... జీవితాన్ని తాగి పడుండక అసలే విడుదలైవున్నావు!" అంటూ పక్కకు తిరిగి....

"కంచుకాన్ని కాల్చే, కమలా! ఇటు రావే! ఈ కీటకానికి విడుదల శాశ్వతం చేయించు, వీడి కదే సరైన శిక్ష! పద, పద మళ్లీ ఆడుకుందాం!" అని అంది.

ఇంతలో ఇంకో బందీ వచ్చి "పద, పద, మల్లమ్మా! ఈ కీటకంతో మనకెందుకు ... మళ్లీ మనకు చాలా పనులున్నాయి. మనకిచ్చిన స్కేళ్లూ, టేపుల్తో, సాహిత్యాన్నీ, సంస్కృతినీ కొలవాలి. అట్లాగే సినిమా చప్పట్లూ కొట్టాలి!" అంది.

మల్లమ్మ, కంచుకాన్ని కాల్చే కమలా నా వైపు కాండ్రించి ఉమ్మి, "పద, పద తామరతూళ్ల తారామణీ!" అని కదిలి వెళ్లిపోయారు.

నా శిథిల గవాక్షం ... దానిపక్కనున్న సాంధ్యచిత్రం నన్ను సముదాయించాయి.

మళ్లీ కాసేపటికి...

ఓ కాషాయ స్వామీజీ, ఓ గడ్డం ముల్లా, చర్చీ ఫాదరూ ముగ్గురూ ముళ్లు వేస్తూ కనిపించనిదాన్ని దేన్నో అల్లుతూ వెళ్తున్నారు.

"అయ్యలూ, అదేమిటండీ?" అడిగా.

"నీకు తెలీదులేరా! మనిషిని ధర్మానికి కట్టేయ్యాలని మా ప్రయత్నం. నోరు మూసుకుని విడుదలను అనిభవించి చావు!" అని కదిలిపోయారు.

వాళ్ల ముగ్గురి కాళ్లకూ పెద్ద కొయ్య దుంగలు కట్టున్నాయి. వాటిని అతి ప్రయాసతో ఈడ్చుకుంటూ వెళ్తున్నారు వాళ్లు. ఆ దుంగలమీద 'మతం' అని చెక్కి ఉంది. 'పాపం, బందీలు...!' అనుకున్నా జాలిగా.

చిరాకుని కిటికీలోంచి విసిరేశా. బయట బందిఖానా బజార్లో ఎవరెవరో నాకి పారేసిన 'సిద్ధాంతాల' ఎంగిలి పొట్లాల మధ్య పడిపోయింది నా చిరాకు. నా శిథిల గవాక్షాన్ని మూసేసా. మూసేసి అనుకున్నాను

'నిజంగా జీవిత వ్యసనం నుంచీ తప్పుకోవడం చాలా కష్టం!'

సమాజ నిర్బంధం నుంచి నేను, నా ఏకాంత స్వాతంత్ర్యంలోకి వచ్చేసి నాలోంచే నేను విడుదలవుతాను. అప్పుడెంత హాయి!

ప్రపంచ బందిఖానాలో ఉక్కిరిబిక్కిరై తన్నుకు చచ్చిన మనసు నా విశాల ప్రపంచంలో తెరిచి పరచిన తెల్ల కాగితాల బ్రతుకుపై, పెన్ను పాళీ గుండా విడుదలై, అక్షరాల స్వేచ్ఛ పొందిన సిరాలా మారిపోతుంది.

అప్పుడు నా స్వాతంత్ర్యం ఓ పాట...!
జీవితం వ్యసనమైనా సరే...!

■